
సాక్షి మంచిర్యాల

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



పోదామా.. 'గట్టు' జాతరకు

జైపూర్ మండలంలోని వేలాల మల్లికార్జునస్వామి జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివ రాత్రిని పురస్కరించుకుని మూడురోజులపాటు జాతర నిర్వహించనున్నారు. 8లో▸



ఆహార భద్రతలో రైతుల పాత్ర కీలకం

ఆహార భద్రతలో రైతుల పాత్ర కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో రేడియో కిసాన్ దివస్ నిర్వహించారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం 36.3 /16.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలితో తేమశాతం తగ్గుతుంది. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్


మల్లికార్జునస్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదననాయక్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరశాల మల్లికార్జునస్వామిని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ



సదయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏసీపీగా పి.సదయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన ఎడ్ల మహేశ్ గతనెల 28న పెద్దపల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ ఏసీపీగా పనిచేస్తున్న సదయ్యను బెల్లంపల్లి ఏసీపీగా నియమించారు. ఈనెల 6న ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యా యి. మహబూబాబాద్ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఉండటంతో బందోబస్తు చర్యలను పర్యవేక్షించిన ఆయన బుధవారం బెల్లంపల్లి ఏసీపీగా బాధ్యతలు చేపట్టారు. సబ్‌డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్సైలు, సిబ్బంది సదయ్యకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఏసీపీ సదయ్య రామగుండం సీపీ రెమారాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్‌రాంనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం



పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 16 కళాశాలలకు చెందిన 1,243 మంది విద్యార్థులకుగాను 1,106 మంది తొలిరోజు పరీక్షలకు హాజరయ్యారు. 154 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 680 మందికి 647, వొకేషనల్ విద్యార్థులు 563 మందికి 459 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీపీ

బెల్లంపల్లిరూరల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 17 నుంచి మూడు రోజులు నిర్వహించే బుగ్గ రాజేశ్వరస్వామి జాతరకు తరలి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ సూచించారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ శివారులోని బుగ్గ రాజేశ్వరస్వామిని డీసీపీ బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో చేపడుతున్న జాతర పనులను పరిశీలించారు. ఏర్పాట్లపై సమీక్షించారు. షామియానాలు వేయాలని, తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆలయ కమిటీకి సూచించారు. మట్టి రోడ్డుపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీసీపీ వెంట తాళ్లగురిజాల ఎస్సై రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, గోపి ఉన్నారు.

ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాలపై నోడల్ అధికారి సమీక్ష

మంచిర్యాలటౌన్: జిల్లాలోని 8 ఆర్‌బీఎస్‌కే టీంలతో అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలపై రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ గోపీకృష్ణ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు, అవసరమైన మందులు అందించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి, పౌష్టికాహారం తీసుకోవడం, ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతీవారం ఒక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని, దాని ప్రకారం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వైద్య సేవలపై ప్రతీనెల సమీక్ష చేసుకోవాల న్నారు. ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శ్రీధర్, డీఎస్‌వో ఫయాజ్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

పొలాలే.. ఫాం ల్యాండ్స్!



జైపూర్‌లో ఏర్పాటు చేసిన ఓ వెంచరులో పెంచుతున్న మొక్కలు

- వనాల వెంచర్లలో మారేది పేరు మాత్రమే
- రైతుల నుంచి కొని మొక్కల పెంపకం
- జిల్లాలో వెలుస్తున్న మెగా వెంచర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వనాల పేర్లతో జిల్లాలో మెగా వెంచర్లు వెలుస్తున్నాయి. ఈ వెంచర్లకు కావాల్సిన భూములను రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న రియల్టర్లు ఆ పొలాల్లోనే మొక్కలు పెంచి తిరిగి ఫాం ల్యాండ్స్‌గా ప్రచారం చేస్తూ అమ్మేస్తున్నారు. అధిక లాభం వస్తుందని, మొక్కలు పెంచిన స్థలమే భవిష్యత్తులో నివాస స్థలాలుగా మారుతుందని హామీలు ఇస్తున్నారు. అయితే ఆ ప్లాట్లలో ఇల్లు కట్టుకునేందుకు అనుమతి ఎలా వస్తుందో మాత్రం చెప్పడం లేదు. ఇలా ఫాం ల్యాండ్స్, రిసార్ట్‌ల పేర్లతో జిల్లాలో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. రైతు నుంచి ఎకరాల్లో కొనుగోలు చేసి గుంటల చొప్పున తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. వీటిని అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఆయా గ్రామ పంచాయతీలకు, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి రియల్టర్లు గండి కొడుతున్నారు.

థర్మల్ ప్లాంట్ చుట్టూ వెంచర్లే

జైపూర్‌లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ప్లాంట్ కనుచూపు మేర మొత్తంలో పంటలు పండే పొలాలన్నీ వెంచర్లుగా మారిపోయాయి. జిల్లా వ్యాపారులతోపాటు పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్‌కు చెందిన పెట్టుబడి దారులు ఇక్కడ రియల్ వ్యాపారం చేస్తున్నారు. జైపూర్ మండలం వేలాల, దుబ్బపల్లి, రామారావుపేట, ఇందారం గ్రామాలతోపాటు, మండల కేంద్రం, థర్మల్ ప్లాంట్ కంటికి కనిపించే పరిధిలో నలువైపుల సుమారు 20 కిలోమీటర్ల మేర వెంచర్లు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ప్లాట్లలో రియల్ సంస్థలు ఇచ్చే ప్రత్యేక ఆఫర్లతో అనేక మంది కొనుగోలు చేస్తున్నారు.

మందమర్రి మండలంలో..

మందమర్రి మండలం వెంకటపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల వంద ఎకరాల్లో మెగా వనం వెంచర్ వెలిసింది. ఎటువంటి అనుమతులు లేకుండానే వ్యవసాయ భూముల్లో రోడ్లు వేసి ప్లాట్లుగా విభజించారు. శ్రీగంధం మొక్కలు పెడుతూ అమ్మకానికి పెట్టారు. తక్కువ ధరకు కొనే ప్లాటు భవిష్యత్తులో నివాస స్థలంగా మారుతుందనే ఆశతో పెట్టుబడులు పెడుతున్నారు. రకరకాల సౌకర్యాలు కల్పిస్తామని పెద్ద ఎత్తున ఏజెంట్లతో ప్రచారం చేస్తుండడంతో జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా కొనుగోలుదారులు వస్తున్నారు.

లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో

లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని గ్రామాల్లో ప్రస్తుతం రియల్ వ్యాపారులు వనాల బాట పట్టారు. జాతీయ రహదారికి ఇరువైపులా లక్సెట్టిపేట వరకు వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. హాజీపూర్ గోదావరి తీరం వరకు ఈ తరహా వెంచర్లు వెలిశాయి. ముల్కల, వేంపల్లి, గుడిపేట శివార్లలో ఫాం ల్యాండ్స్ చేసి అమ్ముతున్నారు. వీటితోపాటు వంద ఎకరాలకుపైగా ఓ ఖరీదైన విల్లాలుగా ఓ మెగా ప్రాజెక్టు ప్రారంభించారు. లక్సెట్టిపేట మండల తిమ్మాపూర్ శివారులో హైదరాబాద్‌కు చెందిన ఓ పెద్ద సంస్థ ఆగ్రో ల్యాండ్స్ పేరుతో ప్లాట్లు చేసి విక్రయాలు జరుపుతోంది.

ఇప్పుడంతా ఇదే ట్రెండ్

ప్రభుత్వం ఓపెన్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కఠినతరం చేయడంతో ఎక్కువగా రియల్ వ్యాపారులు వనాల వెంచర్ల బాటపట్టారు. ప్రస్తుతం ఈ దందా జోరుగా సాగుతోంది. ఏజెంట్లతో ప్రచారం చేస్తూ ఓపెన్ ప్లాట్ల కంటే తక్కువ ధరకే ఈ వెంచర్లలో అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే ఈ వనాల వెంచర్లలో భవిష్యత్తులో ఏదైనా నిర్మాణం చేయాలంటే కొనుగోలు దార్లకు తిప్పలు తప్పవు. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులతోనూ ఆదాయానికి కోత పడుతుంది.

పన్ను చెల్లించని వాహనాలు పట్టుబడితే సీజ్

- జిల్లా రవాణా అధికారి కిష్టయ్య



మాట్లాడుతున్న డీటీఓ కిష్టయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో పన్ను చెల్లించకుండా రోడ్డెక్కే వాహనాలు పట్టుబడితే సీజ్ చేయడంతోపాటు రెట్టింపు జరిమానా వసూలు చేస్తామని జిల్లా రవాణా అధికారి(డీటీవో) ఎల్.కిష్టయ్య స్పష్టం చేశారు. హాజీపూర్ మండలంలోని వేంపల్లి శివారులోని జిల్లా రవాణా కార్యాలయంలో సీనియర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వివేకానంద్ రెడ్డితో కలిసి బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా రవాణా శాఖ పన్ను వసూలు లక్ష్యం రూ.55.86 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.51.37 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వంద శాతం పన్ను వసూలు చేస్తామని పేర్కొన్నారు. పన్ను చెల్లించకుండా తిరుగుతున్న 5,303 రవాణా వాహనాలకు సంబంధించి రూ.3.80 కోట్లు బకాయి ఉండగా రూ.1.66 కోట్ల జరిమానా కలిపి రూ.5.46 కోట్లు మార్చి నెలాఖరులోగా వసూలు చేయాలని ఆదేశించినట్లు వివరించారు. పన్నులు చెల్లించని వాహనదారులు వెంటనే పన్ను చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో 200 శాతం జరిమానాతో పన్ను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వాహనాన్ని వినియోగించని పక్షంలో స్టాపేజీ ఇంటిమేషన్ ఇస్తే పన్ను మినహాయింపు లభిస్తుందన్నారు. రవాణా శాఖకు సమాచారం ఇవ్వకుండా వాహనాలను తుక్కు కింద అమ్మడం నేరమని పేర్కొన్నారు. పన్ను చెల్లించని వాహనాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

నాణ్యత తేలేదిక్కడే!

- ఆదిలాబాద్‌కు ఎఫ్‌క్యూసీఎల్ మంజూరు
- అన్నిరకాల ఫెర్టిలైజర్లకు క్వాలిటీ పరీక్ష
- ఫలితం త్వరగా వచ్చే వెసులుబాటు
- రైతులకు ప్రయోజనకారిగా ఎఫ్‌క్యూసీఎల్
- ఇతర జిల్లాల నుంచి రానున్న శాంపిళ్లు

ఎఫ్‌క్యూసీఎల్ వివరాలు

ల్యాబ్ పేరు: ఎఫ్‌క్యూసీఎల్

పరికరం: ఆదిలాబాద్‌కు చేరింది

విలువ: రూ.62.50లక్షలు

ఏర్పాటు స్థలం: డీఏవో కార్యాలయ ఆవరణ



సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్‌కు ఫెర్టిలైజర్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ (ఎఫ్‌క్యూసీఎల్) మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాగు సీజన్‌లో ఎరువుల డీలర్ల వద్ద వ్యవసాయాధికారులు ఎరువుల నమూనాలు సేకరించి నాణ్యత పరిశీలిస్తారు. ఇప్పటివరకు ఈ పరీక్షల కోసం హైదరాబాద్ లేదా వరంగల్‌కు పంపించేవారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చే నమూనాల పరిశీలన అక్కడ జరిగే పరిస్థితి ఉండగా మన జిల్లాకు సంబంధించిన ఫలితాలు ఆలస్యంగా వచ్చేది. ఈ కారణంగా ఒక్కోసారి డీలర్ తన దగ్గర ఉన్న ఎరువులను పూర్తిగా రైతులకు అమ్మేస్తుంటారు. ఒకవేళ నమూనాలో నాణ్యత లేదని తేలినా అప్పటికే ఎరువు తీసుకున్న రైతు నష్టపోవడం జరుగుతోంది. త్వరలో ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ ల్యాబ్‌తో వెంటవెంటనే ఎరువుల నమూనాల ఫలితాలు వచ్చి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

రాష్ట్రంలో నాలుగోది

ఫెర్టిలైజర్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లు ప్రస్తుతం హైదరాబాద్, వరంగల్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కరీంనగర్‌లో ఏర్పాటు చేశారు. తాజాగా ఇది ఆదిలాబాద్‌కు మంజూరైంది. సాగు సీజన్‌లో రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాషియం, భాస్వరం, నత్రజని ఎరువులతో పాటు నీళ్లలో కరిగే ఇతర ఎరువులను కూడా వాడుతారు. సాధారణంగా ఆ ఎరువు తయారయ్యే కంపెనీ వద్ద మొదట నాణ్యత పరిశీలన ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత వ్యాగన్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఎరువు చేరుకున్నప్పుడు అక్కడా నాణ్యత పరిశీలిస్తారు. ఆ తర్వాత డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ పరీక్ష నిర్వహిస్తారు. తదుపరి డీలర్ వద్ద కూడా ఈ పరీక్ష చేయడం ద్వారా కంపెనీలో తయారైన నాణ్యత డీలర్ వద్ద కూడా అదే ప్రమాణాల్లో ఉందా.. లేదా అనేది తేలుతుంది. తద్వారా పంట ఎదుగుదల కోసం ఎరువులను వాడే రైతులకు ఇది ఎంతో ఉపయుక్తం కానుంది. వ్యవసాయ భూముల్లో సారాన్ని పరీక్షించేందుకు భూసార పరీక్షల మాదిరిగా ఎరువుల్లో నాణ్యతను పరిశీలించేందుకు ఈ ల్యాబ్ తోడ్పడనుంది. తద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

ఇతర జిల్లాల నుంచీ ఇక్కడకూ..

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ పట్టణాల్లో ఎఫ్‌క్యూసీఎల్‌లు ఉన్నాయి. ఇదివరకు మన జిల్లా నుంచి ఎరువుల నమూనాలను హైదరాబాద్‌కు పంపేవారు. అలాగే వరంగల్, కరీంనగర్ జిల్లాలకు కూడా ఇతర జిల్లాల నమూనాలు వెళ్లేవి. కొత్తగా ఆదిలాబాద్ జిల్లాలో దీనిని ఏర్పాటు చేస్తుండగా చుట్టుపక్కల జిల్లాల నమూనాలు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నమూనాల పరిశీలన ఇదే ల్యాబ్‌లో జరగనున్నాయి.

డీఏవో కార్యాలయ ఆవరణలోనే



జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని ఓ గదిలో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తాం. వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం నుంచి ఈ ల్యాబ్ మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు ఇటీవలే వచ్చాయి. త్వరగా దీన్ని ఏర్పాటు చేసి రైతులకు మేలు జరిగేలా చూస్తాం.

– పుల్లయ్య, వ్యవసాయశాఖాధికారి, ఆదిలాబాద్

ఆగుతూ.. సాగుతూ..!

- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల తీరిదీ
- మార్చి 14 వరకు స్టే ఇచ్చిన హైకోర్టు

మంచిర్యాలఅర్బన్: ఏళ్ల తరబడి నిరీక్షించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఆగుతూ సాగుతున్నాయి. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఆటంకాలు ఎదురవుతున్నాయి. భాషా పండితులు పదోన్నతుల్లో తమకు అవకాశం కల్పించాలని దశలవారీ ఆందోళనలు చేశారు. జాబ్ చార్ట్ ప్రకారం పనిచేస్తామని 9, 10 తరగతులకు బోధన నిలిపివేశారు. హైకోర్టు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. భాషా పండితుల విషయం ఎటూ తేలలేదు. తర్వాత జీవో 317 ద్వారా కొత్త జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు పాత జిల్లాలో పనిచేసిన కాలాన్ని పరిగణలోకి తీసుకుని బదిలీల దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఇందులో భాగంగా ఈనెల 12 నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో అర్జీలు స్వీకరించారు. జిల్లాలో 264 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ ధ్రువపత్రాలు పరిశీలించి డీఈవో ఆమోదించాల్సి ఉంది. ఇంతలో.. నాన్‌స్పౌజ్ ఉపాధ్యాయులు హైకోర్టు తలుపు తట్టారు. మంగళవారం విచారణ చేపట్టిన హైకోర్టు బదిలీల ప్రక్రియపై మార్చి 14 వరకు స్టే విధించింది.

బదిలీలకు 1,656 దరఖాస్తులు

ఉపాధ్యాయులు బదిలీల కోసం గతనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. 1,392 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని హార్డ్ కాపీలు సంబంధిత అధికారులకు అందజేశారు. 1,386 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తయింది. నలుగురు ఉపాధ్యాయులు నాట్ విల్లింగ్ ఉండగా ఇద్దరు అర్హత లేకున్నా ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నట్లు సర్టిఫికెట్ల పరిశీలనలో తేలింది. ఇంతలో 317 జీవోతో బదిలీ అయిన వారికి ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం కల్పించారు. దీంతో 264 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి సర్టిఫికెట్లు పరిశీలించాల్సి ఉంది. ఇంతలో హైకోర్టు మార్చి 14 వరకు స్టే ఇచ్చింది.

అపాయింట్‌మెంట్ ఆధారంగా పాయింట్లు

ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో చేరిన తేదీ, ఉ ద్యోగంలో చేరిన తేదీని నమోదు చేయటం ద్వారా ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించి వాటి ఆ ధారంగా జాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది. స్పౌజ్ ఉద్యోగులుగా ఉన్నా వారికి అదనంగా పాయింట్లు కేటాయిస్తారు. ఎనిమిదేళ్ల కాలంలో అదనపు పా యింట్లను ఒకసారి మాత్రమే వినియోగించుకునే అ వకాశం ఉంది. మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాతనే మరోసారి ప్రాధాన్యతను ఉపయోగించుకునే అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధులు, వితంతువులు, అవివాహిత మహిళా ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రాధన్యం ఇ వ్వనున్నారు. ఈనేపథ్యంలో నాన్‌స్పౌజ్ ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లటంతో హైకోర్టు మార్చి 14 వర కు బ్రేక్ వేయటంతో ఉపాధ్యాయుల్లో ఆందోళ న నె లకొంది. ఓవైపు పరీక్షలు సమీపిస్తుండగా దాదాపు నెలరోజులకుపైగా బదిలీలు, పదోన్నతులపైనే దృష్టిపెట్టడంతో బోధనపై ప్రభావం చూపుతోంది. దీంతో బదిలీలు, పదోన్నతులు పరీక్షలకు ముందే చేపడతారా లేక పరీక్షలు ముగిసిన తర్వాత వేసవి సెలవుల్లో చేపడతారా? అనేది తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా బదిలీల ప్రక్రియలో ఇంకెన్ని మలుపులు ఉంటాయో అని ఉపాధ్యాయులే గుసగుసలాడుతున్నారు.

కంటి వెలుగుతో నేత్ర సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ బదావత్ సంతోష్



చెన్నూర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

చెన్నూర్: ప్రజల కంటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో 40 బృందాలను నియమించి 40 శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కంటి వెలుగుకు హాజరైన ప్రజలకు రీడింగ్ అద్దాలతోపాటు ప్రిస్క్రిప్షన్ అద్దాలు అవసరం ఉన్న వారికి నిర్ణీత గడువులోగా అందించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్ జగన్నాథుల శ్రీనివాస్, వైద్యులు భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

చెన్నూర్: రక్తదానం మహాదానమని, రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. స్థానిక పాత వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నిల్వలు లేక తలసేమియా బాధితులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. 67 మంది రెవెన్యూ ఉద్యోగులు రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన చెన్నూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండేను సన్మానించారు. ఈ శిబిరంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ 18వ సారి రక్తదానం చేయడంతో ఆయనను కలెక్టర్ అభినందించారు. ఎంపీపీ బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వ్యవసాయ అధికారి కవిత, ఎస్సై శ్వేత, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ మహేశ్, నాయకులు రాంలాల్‌గిల్డా, నాయిని సతీశ్, మున్సిపల్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: స్థానిక అండాలమ్మ కాలనీ జిల్లా వయోజన విద్యాశాఖ, లయన్స్‌క్లబ్ ఆఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాభ్యాసం, కుట్టు శిక్షణ కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ప్రారంభించారు. అండాలమ్మకాలనీ, రంగంపేట్ ప్రాంతంలోని 655 మంది నిరక్షరాస్యులైన వ యోజనులను అక్షరాస్యులను చేసేలా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్య త ద్వారానే అన్నిరకాల అభివృద్ధి జరుగుతుంద న్నా రు. వందరోజుల్లో వందశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలన్నారు. వయోజన మహిళల కు పలకలు, పీచికలు అందజేశారు. అక్షరాస్యతతోపా టు కుట్టు శిక్షణ, అల్లికల ద్వారా స్వయం స మృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, లయన్స్‌క్లబ్, మంచిర్యాల సఖీ అధ్యక్షులు అన్నపూర్ణ, కరుణాకర్, లయన్స్ గవర్నర్ నారాయణారెడ్డి, సభ్యులు వెంకటేశ్వరావు, చంద్రమోహన్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, రాజమౌళి, డీఆర్పీలు వెంకటేశ్వర్లు, శాంకరి, సువర్ణ, కౌన్సిలర్ బొలిశెట్టి సునీత, అంగన్‌వాడీ టీచర్ శోభ, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..!

- ఈనెల 17 నుంచి 20వరకు రోజుకు 30 సర్వీసులు
- కాళేశ్వరం, కత్తెరశాల, వేలాల జాతర కోసం ఏర్పాటు



మంచిర్యాల బస్‌డిపోలో నిలిపి ఉంచిన బస్సులు

మంచిర్యాలఅర్బన్: మేడారం జాతర వేళ అదనపు ఆదాయాన్ని సమకూర్చుకున్న ఆర్టీసీ యాజమాన్యం మహాశివరాత్రి పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధమవుతోంది. జిల్లా కేంద్రమైన మంచిర్యాల డిపో నుంచి ఆయా శైవక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపించాలని సంస్థ నిర్ణయించింది. ఇందులో భాగంగా వేలాల మల్లన్న జాతరతోపాటు కాళేశ్వరం వరకు బస్సులు నడిపించాలని నిర్ణయించింది. ఈనెల 17 నుంచి 20 వరకు జాతరకు బస్సులు నడపనున్నారు. జాతర సందర్భంగా రోజుకు 30 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనున్నాయి.

మంచిర్యాల, శ్రీరాంపూర్, చెన్నూర్ బస్‌స్టేషన్ల నుంచి కాళేశ్వరం, కత్తెరశాల, వేలాల జాతరకు బస్సులు రాకపోకలు సాగించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. వేములవాడకు వెళ్లాలంటే కరీంనగర్‌కు వెళ్లి అక్కడి నుంచి మరో బస్సులో ప్రయాణించాల్సి ఉంటుంది. జాతర సందర్భంగానైనా వేములవాడ రాజరాజేశ్వర ఆలయానికి ప్రత్యేక బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ 'సాక్షి'కి తెలిపారు. మంచిర్యాల డిపో నుంచి వేలాల, కాళేశ్వరం చార్జీలు ఇలా ఉన్నాయి.

బస్సు రాకపోకలు ..	పెద్దలకు	పిల్లలకు
మంచిర్యాల – జైపూర్ – వేలాల జాతరకు	రూ.70	రూ.40
చెన్నూర్ – కత్తెరశాల – వేలాల	రూ. 70	రూ.40
శ్రీరాంపూర్ – జైపూర్ – వేలాల	రూ. 60	రూ.35
మంచిర్యాల – చెన్నూర్ – కాళేశ్వరం	రూ.120	రూ.60
శ్రీరాంపూర్ – చెన్నూర్ – కాళేశ్వరం	రూ.110	రూ.60
చెన్నూర్ – సిరోంచా – కాళేశ్వరం	రూ.70	రూ.40



క్లుప్తంగా

సీఎంపీఎఫ్, గ్రాట్యుటీపై సమీక్ష



క్లర్కులతో సమావేశమైన అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో ఉద్యోగుల సీఎంపీఎఫ్, గ్రాట్యుటీ వ్యవహారాలను చూసే క్లర్క్‌లతో బుధవారం పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు ఉద్యోగుల సీఎంపీఎఫ్ నామినేషన్ ఫారాలను నింపే విధానం, కోర్టు వ్యవహారాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగ విరమణ, ఉద్యోగి మరణం అనంతరం పింఛన్ కోసం దరఖాస్తులు, వాటి పరిశీలన విధానంపై క్లరికల్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ఏరియాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీవైపీఎం తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొడుకుతో గొడవపడి తల్లి ఆత్మహత్య

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి మత్తమారి గూడేనికి చెందిన నిమ్మల సరోజన(57) అనే మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై సంతోష్ కథనం ప్రకారం.. సరోజన కొడుకు నిమ్మల రాజ్‌కుమార్‌కు ఐదేళ్ల క్రితం పెళ్లి అయింది. పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటుండటంతో అతని భార్య ఏడాది క్రితం వదిలి పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి రాజ్‌కుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై తల్లి సరోజన మూడు రోజుల క్రితం కొడుకు రాజ్‌కుమార్‌ను బుద్ధిగా ఉండమని హితవు చెప్పడంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన సరోజన ఈ నెల 12న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోగా, బుధవారం పోచమ్మ చెరువులోని నీటిలో శవమై తేలింది. మృతదేహాన్ని పోలీసులు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం చేయించారు. కొడుకు కారణంగానే మృతురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలుకింద పడి వ్యక్తి మృతి



నందకుమార్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ప్రయాణికుడు రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రైలుకింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంచిర్యాలలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేష్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా దార్వాజ గ్రామానికి చెందిన నందకుమార్ గజిబైయే (39) మూడు నెలల క్రితం రామగుండంకు వలస వచ్చినట్లు తెలిపారు. 5ఇన్‌క్లైన్ కాలనీలో నివాసం ఉంటూ పీవీఆర్ కంపెనీలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు వివరించారు. తన కుమారుడు అనారోగ్యానికి గురైనట్లు బంధువులు సమాచారం ఇవ్వడంతో ఇంటికి వెళ్లేందుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు వచ్చి, మహారాష్ట్రవైపు వెళ్లే (గుర్తు తెలియదు)ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కేందుకు ప్రయత్నించగా జనరల్ బోగిలో రద్దీ ఎక్కువ ఉండడంతో కాలుజారి కింద పడినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి కృష్ణ గిజబైయే ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోదామా.. ‘గట్టు’ జాతరకు



గట్టుపై దొణలో స్వయంభూగా వెలిసిన శివలింగం



వేలాల మల్లికార్జునస్వామి ఆలయం

- భక్తుల కొంగు బంగారం మల్లికార్జునస్వామి
- ఈ నెల 18న మహా జాతర
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- తరలిరానున్న 4 లక్షలకుపైగా భక్తులు

జైపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే జైపూర్ మండలం వేలాల మల్లికార్జునస్వామి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. పిలిస్తే పలికే దేవుడిగా.. భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తూ.. కొంగు బంగారంగా గట్టు మల్లన్నస్వామి వెలుగొందుతున్నాడు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ జాతర నిర్వహిస్తారు. ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మూడు రోజులు నిర్వహించనున్న జాతరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వేలాల గ్రామాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధి

ఏటా వేలాల గట్టు మల్లన్నస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. గుట్టపై స్వయంభూగా స్వామి వారు వెలిసిన దొణను ఈసారి వెడెల్పు చేశారు. గుట్టపై భక్తులకు సర్వదర్శనం కల్పించడానికి గుట్టను కొంత భాగం తొలిచి వెడెల్పు చేశారు. ఈ ఏడాది జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి సుమారు 4 లక్షలకుపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడు రోజులపాటు జాతర..

మూడు రోజులపాటు సాగే జాతరలో మొదటి రోజున గ్రామ సమీపంలోని గుట్టపై దొణలో స్వయంభూగా వెలిసిన గట్టు మల్లన్నస్వామికి మొక్కులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా ఇక్కడ జన జాతర కొనసాగుతుంది. రాత్రంతా భక్తులు జాగారం చేస్తారు. వేదపండితులు, ఒగ్గు పూజారులు సంప్రదాయబద్ధంగా శ్రీమల్లికార్జున స్వామి భ్రమరాంభికలకు పట్నం వేసి వైభవంగా కల్యాణం జరిపిస్తారు. మరుసటి రోజు గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయం వద్ద రెండో రోజున జాతర సాగుతోంది. భక్తులు గుట్టపై నుంచి కిందకు చేరుకుని స్వామికి మొక్కులు చెల్లించుకుని బోనాలు పోసి పట్నాలు వేసి మొక్కులు తీర్చుకుంటారు. మూడో రోజున జాతరను ముగిస్తారు.



తొలిచిన దొణ

చెలిమ నీరే తీర్థం

గట్టు మల్లన్నస్వామి చెలిమె నీటికి ఒక ప్రత్యేకత ఉంది. చాలా ఎత్తయిన గుట్టపై గల ఒక దొణలో శివలింగం ఉండి ఆ పక్కనే ఊట చెలిమె ఉంటుంది. ఈ చెలిమెలో అన్ని కాలాల్లో నీరు ఉంటుంది. గట్టు మల్లన్నస్వామిని దర్శించుకున్న భక్తులు ఈ చెలిమె నీటిని తీర్థంగా స్వీకరిస్తారు. ఈ నీటిని తీర్థంగా తీసుకుంటే శారీరక రుగ్మతలు పోతాయని, పంటలపై చల్లతే బాగా పండుతాయని భక్తుల నమ్మకం. ఇంట్లో చల్లుకుంటే శుభాలు కలుగుతాయని నమ్ముతారు.

పూజలూ ప్రత్యేకమే..

ఇక్కడ పూజలు బ్రహ్మణులు చేపడుతున్నప్పటికీ ఒగ్గు పూజారులు వారి సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తారు. పెద్దపట్నం వేసి శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం మహోత్సవం, నాగవెల్లి జరిపిస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులు ఒగ్గు పూజారులతో మల్లికార్జున స్వామికి పట్నాలు వేయించి పట్టువస్త్రలు సమర్పించడం ఇక్కడ ప్రత్యేకత.

200 ఏళ్ల చరిత్ర

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గోదావరి నది తీరంలోని వేలాల గ్రామంలో గత 200 ఏళ్ల క్రితం శ్రీమల్లికార్జునస్వామి స్వయంభూగా వెలిసినట్లు స్థానిక పురాణం ఉంది. గ్రామానికి చెందిన నరహరి పోగుల పుల్లు అనే పశువుల కాపరి గొర్లు, మేకలు, ఆవులను తోలుకొని గ్రామ సమీపంలోని ఒక గుట్టకు వెళ్లేవాడు. అక్కడ ఆయన ఒక దొణలో పూజలు చేసేవాడు. అతడు తోలుకెళ్లిన పశువులు మాత్రం ఎక్కడికీ వెళ్లకుండా భద్రంగా ఉండేవి. కాలక్రమంలో నరహరి పోగులపుల్లు అదృశ్యమయ్యాడు. అనంతరం గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు దొణ వద్దకు వెళ్లి పిలిస్తే దొణ నుంచి పలికేవాడు. గ్రామస్తులు వారి బాధలు చెప్పుకుంటే తీర్చేవాడు. వారి పశువులు తప్పిపోతే ఎక్కడున్నాయో అని అడిగితే కచ్చితంగా సమాచారం చెప్పేవాడు. ఒక వ్యక్తి నరహరి పోగులపుల్లును పిలిచి పలికిన వెంటనే దూషించి అవహేళన చేశాడని దీంతో అప్పటి నుంచి పలకడం మానేశాడని చెబుతారు. అప్పటి నుంచి దొణలో స్వయంభూగా వెలిసిన శివలింగాన్ని పూజిస్తూ గ్రామంలో ఆలయం నిర్మించి ఏటా మహాశివరాత్రికి మహాజాతర నిర్వహిస్తున్నారు. గొర్ల కాపర్ల (యాదవుల) ఆరాధ్యదైవమైన శ్రీమల్లికార్జున స్వామికి ఒగ్గు పూజారులు వారి సంప్రదాయంగా పట్నాలు, బోనాలు పోసి సనాతనంగా పూజలు నిర్వహిస్తున్నారు. కోరిన కొర్కెలు తీర్చే దైవంగా భావించి యాదవుల తోపాటు అన్నివర్గాల ప్రజలు తమ ఇష్టదైవంగా మల్లన్నను పూజిస్తున్నారు.

గుట్టపై తాగునీటి సమస్య..

గోదావరిలో పుణ్యస్నానాల కోసం వెళ్లిన భక్తులు అక్కడ అసౌకర్యాలతో ఇక్కట్లు పడుతున్నారు. పుణ్యస్నానాల తర్వాత మండుటెండలో బోనాలు పట్టుకుని పిల్లాపాపలతో గుట్టపై కాలినడకన చేరుకుంటారు. అక్కడ తాగునీటి వసతి లేక తండ్లాడుతున్నారు. గుట్టపై ఒక్క బోరు ఉండడం.. పెద్ద వాటర్ ట్యాంక్‌లోకి నీళ్లు నింపి అందిస్తున్నారు. ఒక్కోసారి మోటారు పాడైపోవడంతో ట్యాంక్‌లోకి నీళ్లు ఎక్కడం లేదు. నీటిపంపుల వద్ద భక్తుల తోపులాటలు జరిగిన సందర్భాలున్నాయి. గుట్టపై మరో మూడు బోర్లు ఏర్పాటు చేయాలి. కింద నుంచి గుట్టపై వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. కాలినడక వెళ్లే భక్తులకు దారిపొడువునా తాగునీరందించాలి. ఎండ వేడిమి తగలకుండా చలువ పందిళ్లు వేయాలి. ప్రధానంగా గుట్టపైన, కింద భక్తుల సౌకర్యార్థం తాత్కాలికంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. ఒగ్గు పూజారులు పట్నాలు వేసేందుకు స్థలం కేటాయించాలి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ట్రెయినీ కలెక్టర్ గౌతమి అన్నారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో బుధవారం వారాంతపు సమీక్ష నిర్వహించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులకు రోజూ 60 మంది హాజరయ్యేలా చూడాలన్నారు. నర్సరీల్లో పనులు చేపడుతూనే మొక్కలు ఎండి పోకుండా గ్రీన్ షేడ్‌నెట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పల్లెకు ప్రకృతి వనాల అభివృద్ధి, కల్లాల నిర్మాణాలు, బృహత్, మినీ బృహత్ ప్రకృతి వనాల నిర్వహణ నిర్విరామంగా చేపట్టాలని సూచించారు. కంపోస్ట్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పనులు పారదర్శంగా చేయాలని తెలిపారు. సమావేశంలో భాగంగా ఆడిట్ నివేదికలు, పన్నుల వసూళ్లు, ఆన్‌లైన్ నమోదు ఎప్పటికప్పుడు జరపాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో అబ్దుల్‌హై, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

బీపీఏలో ఉద్యోగులను నియమించాలి



జీఎంతో చర్చిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా(బీపీఏ)లోని గనులు, డిపార్టుమెంట్లలో ఉద్యోగులను నియమించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సెంట్రల్ కమిటీ, ఏరియా నాయకులతోపాటు ఫిట్ కార్యదర్శులతో కలిసి జీఎం దేవేందర్‌ను కలిశారు. ఏరియాలో కార్మికుల కొరతపై జీఎంతో చర్చించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏరియాలో కార్మికుల కొరత ప్రభావం ఉత్పత్తితో పాటు రక్షణపై పడుతోందన్నారు. కొత్త కార్మికులను ఏరియాకు బదిలీపై తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏరియా వర్క్‌షాప్, కైరిగూడ, ఏరియా స్టోర్స్, సీహెచ్‌పీలలో కార్మికుల కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. మహిళా కార్మికులను జనరల్ మజ్దూర్‌లుగా లెక్కకట్టడంతో ఇబ్బంది కలుగుతోందని పేర్కొన్నారు. 50 ఏళ్లకు పైబడిన వారు వయోభారంతో పూర్తిస్థాయిలో పని చేయలేక పోతున్నారని అన్నారు. సమస్యను కార్పొరేట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, చర్చల ప్రతినిధి మంగీలాల్, జీఎం కమిటీ సభ్యులు సమ్మయ్య, రవీందర్, నాయకులు సంపత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితం.. బుగ్గ క్షేత్రం



శ్రీ బుగ్గ రాజేశ్వర ఆలయం

బెల్లంపల్లిరూరల్:మూడు గుట్టల నడుమ స్వయంభూగా వెలిసి గంగధారతో నిత్యం జలాభిషేకంతో ఘనమైన పూజలు అందుకుంటున్నాడు బుగ్గ రాజేశ్వరుడు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పుణ్య క్షేత్రం బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ శివారులోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. బుగ్గ రాజేశ్వరస్వామి శివలింగంపై కొండల అంతర్భాగం నుంచి వచ్చే జలంతో శివయ్యకు నిత్యం సహజ అభిషేక స్వరూపుడై భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఏటా మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మూడు రోజులపాటు ఇక్కడ జాతర జరుగుతుంది. ప్రతీ సోమ, శుక్రవారాలు, ఇతర పండుగలు, ప్రత్యేక రోజుల్లో ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 17 నుంచి 19 వరకు జాతర నిర్వహించున్నారు.

ఆలయ విశిష్టత....

పూర్వం దేవతా సంభూతుడైన అఘోర యోగిపుంగవుడు ఒకరు చిత్రకూట పర్వత శ్రేణుల నుంచి ఈ ప్రాంతానికి వచ్చి ఆవాసం ఏర్పర్చుకుని ఈ కొండలపై తపస్సు ఆచరించేవాడు. అతనికి ఉన్న దివ్య యోగ దృష్టితో ప్రతీ మహాశివరాత్రి పర్వదినమున 24 గంటల వ్యవధిలో కాశీ క్షేత్రానికి వెళ్లి వచ్చేవాడు. అలా ఎన్నో ఏళ్లు గడిచిపోయాయి. యోగి పుంగవుడు వృద్ధాప్యంతో శారీరకంగా బలహీనుడయ్యాడు. ఇంతలోనే మహాశివరాత్రి పుణ్యకాల గడియలు రావడంతో ఆ మునీశ్వరుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మహాశివరాత్రి లాంటి పర్వకాలమును చూసేందుకు తన జవసత్వాలు సరిపోవడం లేదని ఆ దేవదేవున్ని తలుచుకుంటూ తీవ్రంగా విలపిస్తూ ఆ పరమేశ్వరుడినే ధ్యానిస్తూ నిద్రలోకి జారుకున్నాడు. ఇంతలో తెల్లవారుజామున పరమేశ్వరుడు ప్రత్యక్షమై ‘ఓ భక్తా నీ భక్తికి మెచ్చాను. నీవు ఇక చింతించాల్సిన అవసరం లేదు. నేను ఆ త్రిభువన తారిణి అయిన గంగతో ఈ మూడు కొండల మధ్యనే వెలిశాను. నన్ను నిరంతరం సేవిస్తూ ఉండూ... అని చెప్పి అంతర్ధానం అయ్యాడు. నాటి నుంచి నేటి వరకు తన ప్రియ భక్తులతో ఆ రాజేశ్వరుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. 2000 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ శివక్షేత్రాన్ని చోళరాజులు, కాకతీయులు, ఆరే పటేల్ ఛత్రపతి శివాజీ దర్శించుకున్నట్లు చరిత్రకారులు చెబుతారు.

నిత్యం జాలువారే గంగధార..

మూడు కొండల నడుమ వెలిసిన బుగ్గ రాజేశ్వరుడికి నిత్యం సహజ జలాభిషేకం జరుగుతోంది. కొండల అతంర్భాగం నుంచి వచ్చే ఈ జలధార నేరుగా శివలింగంపై పడుతుంది. మరొక ధార నేరుగా కోనేటిలో కలుస్తుంది. ఈ నీటి పుట్టుక స్థానం ఎక్కడ అనేది ఎవరికీ తెలియదు. అన్ని కాలాల్లో ఈ జీవధార ప్రవహిస్తూనే ఉండడం గమన్హారం. ఈ రాజేశ్వరుడికి అభిషేకమైన ఈ నీటిని భక్తులు మహా ప్రసాదంగా స్వీకరిస్తూ ఉంటారు.

ముమ్మరంగా జాతర ఏర్పాట్లు...

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో జాతర పనులు ప్రారంభమయ్యాయి. ఆలయానికి నూతన రంగులు, పరిసరాలను పరిశుభ్రం చేయడం, షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. దర్శనాల కోసం క్యూలైన్ల ఏర్పాట్లు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణాల వద్ద నీటి ఏర్పాటుతోపాటు అన్ని రకాల పనులు చేపడుతున్నారు. జాతరలో భాగంగా మొదటి రోజు పచ్చని పందిరి వేయడంతో పాటు ఇతర పూజా కార్యక్రమాలు ని ర్వహిస్తారు. రెండో రోజు మహాశివరాత్రి తెల్లవారు జాము నుంచే రుద్రాభిషేకం, బిల్వార్చన, అభిషేకం పూజలు నిర్వహించి భక్తుల దర్శనం చేయిస్తారు. రాత్రి శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహిస్తారు. చివరి రోజున పూజలతో జాతర ముగుస్తుంది.

పతనం అంచున కేసీఆర్ ప్రభుత్వం

- మాజీ ఎంపీ గడ్డం వివేక్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వివేక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గడ్డం వివేక్

నెన్నెల: ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోని కేసీఆర్ ప్రభుత్వం పతనానికి అంచున ఉందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ అన్నారు. మైలారంలో బుధవారం నిర్వహించిన ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అని మాయ మాటలు చెప్పి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ ఇప్పుడు ఎవరినీ పట్టించుకోవడం లేదన్నారు. బంగారు తెలంగాణ లో అప్పులు, రైతుల ఆత్మహత్యలే తప్ప అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధిని తామే చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కేసీఆర్ రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. హైదరాబాద్‌లో 20 వేల ఎకరాల భూములు కొనుక్కున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నా రు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నెన్నెలలో ఉ ద్యోగం రాలేదని ఆత్మహత్య చేసుకున్న యువకుడు పుప్పాల రఘు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీశ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమండల రమేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏమాజీ, కన్వీనర్ సంతోష్, నెన్నెల మండల అధ్యక్షు డు శైలేందర్‌సింగ్, నాయకులు గోవర్ధన్, శ్రీనివాస్, సాంబమూర్తిగౌడ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మందమర్రిరూరల్: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు వివేక్ బీజేపీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని నిర్వహించిన పార్టీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు మార్చి నిధులు దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు అందుగుల శ్రీనివాస్, సప్పిడి నరేశ్, దీక్షితులు, కుమారస్వామి, దుర్గరాజ్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్సవాలకు పెద్దపీట



రామారావు మహరాజ్ విగ్రహం ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



గోధుమ బుట్టలతో కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

- జెడ్పీ చైర్‌పర్సన్లు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్
- కెరమెరిలో ఘనంగా రామారావు మహరాజ్ విగ్రహావిష్కరణ

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కుమురంభీం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్ అన్నారు. కెరమెరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీసంత్ సద్గురు రామారావు మహరాజ్ విగ్రహాన్ని బుధవారం ప్రేంసింగ్ మహరాజ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్వీ రామారావు మహరాజ్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కెరమెరి మండలంలోని శంకర్‌లొద్ధి, జంగుబాయి పవిత్ర స్థలాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడతామని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రామారావు మహరాజ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గోధుమ బుట్టలు నెత్తిన పెట్టుకుని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి చిన్నారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచులు బైనాబాయి, శేశారావు, ఎంపీటీసీ సంగీత, సేవాలాల్ ఉత్సవ కమిటీ చైర్మన్ రవి, గౌరధ్యక్షుడు రాథోడ్ శంకర్‌నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్, నాయకులు రాథోడ్ ఉత్తం నాయక్, లాల్‌సింగ్, వెంకటి, వెంకట్రావ్, శివాజీ, దస్రు, లాలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

భీమిని: మండలకేంద్రం నుంచి కుమురం భీం జిల్లాకు అబ్దుల్ సల్మాన్ అనే వ్యక్తి ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా ఎస్సై వెంకటేష్ బుధవారం పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ఆటోలో తనిఖీ చేయగా రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గనులపై మైనింగ్ స్టాఫ్ నిరసన

- భూపాలపల్లిలో సర్దార్‌ను డిస్మిస్ చేయడంపై ఆగ్రహం
- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు



ఎస్సార్పీ 3గనిలో మేనేజర్‌కు మెమోరాండం ఇస్తున్న మైనింగ్ సిబ్బంది

బెల్లంపల్లి/శ్రీరాంపూర్: భూపాలపల్లి కేటీకే 8 ఇంక్లెన్‌లో ప్రకాశ్ అనే మైనింగ్ సర్దార్‌కు గని ప్రమాదానికి ఎలాంటి సంబంధం లేకున్నా క్రమశిక్షణ చర్యల పేరుతో యాజమాన్యం ఉద్యోగాల్లో నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ కంపెనీ వ్యాప్తంగా మైనింగ్ సిబ్బంది నిరసన తెలిపారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో అన్ని గనులపై, మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి సంఘాలకతీతంగా అన్ని వర్గాల మైనింగ్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యల్లో మైనింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి వారిని యాజమాన్యం వేధింపులకు గురిచేయడం అన్యాయమన్నారు. తక్షణమే డిస్మిస్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, లేకుంటే సమ్మెకైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సింగరేణిలో మైనింగ్ సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఆర్కే 6 గనిపై మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ సెక్రెటరీ వంగరి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో, ఇందారం ఓసీపీ, ఐకే ఐకే 1ఏ గనిపై మైనింగ్ స్టాఫ్ నాయకులు అన్వేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఎస్సార్పీ 3గనిలో మైనింగ్ స్టాఫ్ నాయకులు సాధుల భాస్కర్ ఆధ్వర్యంలో మేనేజర్లకు వినతిపత్రాలు సమర్పించారు.

రెండు సంఘాలు విఫలం: హెచ్ఎమ్మెస్

మైనింగ్‌సర్దార్ డిస్మిస్‌ను అడ్డుకోవడంలో గుర్తింపు సంఘంతో పాటు ప్రాతినిధ్య సంఘంగా ఉన్న ఏఐటీయూసీ నేతలు విఫలమయ్యారని హెచ్ఎమ్మెస్ బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, మీస కొమురయ్య, దుర్గం లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. యాజమాన్యం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే పెద్దయెత్తున ఆందోళన చేస్తామన్నారు.

డిస్మిస్‌ను ఉపసంహరించుకోవాలి: ఏఐటీయూసీ

ప్రకాశ్‌పై డిస్మిస్‌ను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాజీసైదా, వీరభద్రయ్య, కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీలు కొట్టె కిషన్‌రావు, ఎం కొమురయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి సంబంధం లేకున్నా అక్కడ జరిగిన ప్ర మాదానికి ఆయన్ను బాధ్యులు చేస్తూ చర్యలు తీ సుకోవడం అన్యాయమన్నారు. దీన్ని ఉపసంహరి ంచుకోకుంటే పెద్దయెత్తున ఉద్యమం తప్పదన్నారు

క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకోవాలి

రామకృష్ణాపూర్: గని ప్రమాదానికి మైనింగ్ సిబ్బందిని బాధ్యుల్ని చేస్తూ తీసుకున్న తీవ్రమైన క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ మందమర్రి ఏరియాలోని ఆర్‌కే1ఏ గని, ఆర్‌కే ఓసీలో మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు బుధవారం అధికారులకు వినతిపత్రం అందించారు. చర్యలు ఉపసంహరించుకోకపోతే సమ్మెకు సైతం వెనుకాడమని పేర్కొన్నారు.